బంగారు దేవి.. గజ్జలమ్మ తల్లి

- కోనేరులో వెలసిన అమ్మవారు
- భక్తుల కోరికలు తీర్చే ఇలవేల్పు
- ఈనెల 9నుంచి ఆలయ వార్షికోత్సవం

కుంటాల: కలలోకి వచ్చి.. కోనేరులో ప్రత్యక్షమై గ్రామదేవతగా పూజలు అందుకుంటూ కుంటాల ఇలవేల్పుగా విరాజిల్లుతుంది గజ్జలమ్మ దేవి. తనను కొలిచిన భక్తుల కోరికలు నెరవేరుతుండటంతో ఆ ఊరిలో ఎక్కువ మంది పేర్లు అమ్మవారి నామంతోనే ఉంటాయి. ఈనెల 9నుంచి ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా సాక్షి కథనం..

కోనేరులో ప్రత్యక్షమై..
పూర్వకాలంలో కుంటాలకు చెందిన మూసరి వంశీయులు రోజు వేట కోసం అడవికి వెళ్లేవారు. వారిలో మూసరి ముత్తన్నకు గ్రామ శివారులో ఉన్న నీటి గుంటలో ఓ విగ్రహం కనిపించింది. అదే రోజు రాత్రి ఆయన కలలోకి వచ్చి.. నేను ఢిల్లీ దగ్గరలోని గజాపురం నుంచి కుంటాలకు వచ్చానని.. నా పేరు గజ్జలమ్మ అని చెప్పింది. ముత్తన్న మరుసటి రోజు ఈ విషయాన్ని గ్రామస్తులకు వివరించి నీటి గుంటలో ఉన్న విగ్రహాన్ని బయటకు తీసి ఓ చెట్టు కింద ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ఈ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.51 లక్షలతో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు.

ఊరిలో సగానికిపైనే అమ్మ వారి పేర్లు..
కుంటాలలో సుమారు 4వేల పైచిలుకు జనాభా ఉంది. తమ కోరికలు తీరుతుండటంతో ఊరిలో సగం మంది తమ పిల్లలకు అమ్మవారి పేరు పెట్టుకుంటున్నారు. ఇంట్లో పాప జన్మిస్తే గజ్జలమ్మ, గజ్జవ్వ, బాబు జన్మిస్తే గజ్జయ్య, గజేందర్, గజ్జారాం అని నామకరణం చేస్తారు. కంప్యూటర్ యుగంలో ట్రెండు మారినా.. మొదటగా అమ్మవారి పేర్లు పెట్టడం.. ఇంట్లో అవే పేర్లతో పిలవడం నేటికీ కొనసాగుతుంది.


కుంటాలలోని గజ్జలమ్మ ఆలయం

నైవేద్యంలోనూ ప్రత్యేకం..
గజ్జలమ్మ దేవికి ప్రత్యేకమైన నైవేద్యాన్ని సమర్పిస్తారు. గంగనీళ్ల జాతర సందర్భంగా దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గోదావరిలో అమ్మవారి నగలను శుద్ధిచేసి తీసుకొస్తారు. అప్పటినుంచి ఆలయంలో పూజలు ప్రారంభిస్తారు. దేవలదండు అమావాస్యను పురస్కరించుకుని రాత్రి వండిన అన్నం, పెరుగుతోపాటు పిడకలు, ఆవు పేడతో అమ్మవారికి బోనం సమర్పిస్తారు. ఏటా మృగశిర కార్తెలో గజ్జలమ్మ తీర్థం(జాతర) నిర్వహిస్తారు. అమ్మవారికి ఓమ, పుట్నాలు, ఉల్లిగడ్డలు సమర్పిస్తారు. చిన్న పిల్లలకు తలనీలాలు, తులాభారం(బంగారం) వేయించి మొక్కులు తీర్చుకుంటారు.

ఈనెల 9 నుంచి ఉత్సవాలు..
కుంటాల శ్రీ గజ్జలమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవం ఈనెల 9 నుంచి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 9న భగవతి ప్రార్థన, విశేష సంకల్పం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, సంస్కారం, వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ యోగిని, కర్కరి, సర్వతోభద్ర మండల స్థాపన, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత దేవతా హోమం, రథ జలాభిషేకం, కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పం, 10న ఉదయం నిత్యవిధి, యజ్ఞం, శ్రీ గజ్జలమ్మ కళ్యాణం, రథోత్సవం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 11న నిత్యవిధి, మహా పూర్ణహారతి, కుంభాభిషేకం, బోనాల పండుగ తదితర పూజాది కార్యక్రమాలు వేదపండితులు శ్రీ గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.


అమ్మవారు

ఏటా అమ్మవారికి బోనం..



మా తాత, ముత్తాతల నుంచి కుంటాల గజ్జలమ్మ వద్దకు వెళ్తున్నాం. ప్రతి ఏటా అమ్మవారికి బోనంను నైవేద్యంగా సమర్పించిన తర్వాతనే ఇంట్లో శుభకార్యాలు చేసుకుంటాం.
– గంట గజ్జయ్య, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్ జిల్లా

పూజిస్తే శుభమే..



గజ్జలమ్మను పూజిస్తే అంతా శుభమే కలుగుతుంది. అమ్మవారి భక్తులు హైదరాబాద్, ముంబై నగరాల్లో ఆలయాలు నిర్మించి కొలుస్తున్నారు. పిల్లలకు అమ్మవారి పేర్లు పెట్టడం ఆనవాయితీగా వస్తుంది.
– ఒడ్నం గజ్జారాం, కుంటాల

కోరికలు నెరవేరుతున్నాయి



మాతాత ముత్తన్నకు గజ్జలమ్మ కోనేరులో కనిపించి కలలోకి వచ్చి నన్ను ప్రతిష్ఠించాలని కోరిందట. గ్రామస్తులు విగ్రహాన్ని ప్రతిష్ఠించి గుడి నిర్మించారు. భక్తుల కోరికలు నెరవేరుతుండటంతో ప్రతి ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది.
– మూసరి నగేశ్, అర్చకులు

క్లుప్తంగా

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యంతో ఎస్సై అశోక్

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు. పిప్రి గ్రామంలోని కిషన్‌గౌడ్ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో వెళ్లి తనిఖీ చేయగా 16.48 లీటర్ల మద్యం బాటిళ్ల పట్టుబడినట్లు పేర్కొన్నారు. వాటి విలువ రూ. 9,565 ఉంటుదని తెలిపారు. కిషన్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముథోల్ నియోజకవర్గానికి రూ.10కోట్లు మంజూరు

భైంసాటౌన్: ముథోల్ నియోజకవర్గంలో ఎస్సీ సబ్‌ప్లాన్–2024 కింద చేపట్టే పలు అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల సీఆర్ఆర్ గ్రాంట్ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పి. రామారావు పటేల్ తెలిపారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కను కోరినట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు జి.విఠల్‌రెడ్డి తెలిపారు.

కాల్వ భూములు పరిశీలించిన అధికారులు

సాక్షి స్పందన

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ మొదలుకుని కౌట్ల(బి), సారంగాపూర్, అడెల్లి, జామ్, ధని, చించోలి(బి), గోపాల్‌పేట్ గ్రామాల్లో నిర్మించిన హైలెవెల్ కాలువ భూములను కొందరు రైతులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు. దీనిపై ఈనెల 6న సాక్షిలో 'ఆక్రమణలో కాల్వ భూములు' శీర్షికన ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం ఏఈ మిరాజొద్దీన్, ఈఈ అనిల్ కలిసి స్వర్ణ గ్రామం నుంచి మామడ మండలం తాంద్ర గ్రామం వరకు కాలువ భూములను పరిశీలించి పలువురి రైతుల వివరాలను సేకరించారు. ఏఈ మిరాజొద్దీన్ మాట్లాడుతూ కాలువ భూములు ఆక్రమించుకున్న వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. పలువురు రైతులు దురుసుగా ప్రవర్తించగా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. లేక్ ప్రొటెక్షన్ కమిటీని సైతం వినియోగించుకుని కాలువ భూముల పరిరక్షణకు కృషి చేస్తామని వివరించారు.

'సీఎంకు రుణపడి ఉంటాం'


క్షీరాభిషేకం చేస్తున్న మాదిగ సంఘ నేతలు

కడెం: ఎస్సీ వర్గీకరణ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటారని మాదిగ సంఘం నాయకులు పేర్కొన్నారు. వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కడెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు పడిగేల భూషణ్, ఆశన్న, ఆనంద్, రవి, బాలరాజ్, గంగారాం తదితరులున్నారు.

మల్లు అనంతరాములు వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మల్లు అనంతరాములు 35వ వర్ధంతి నిర్వహించారు. రాహుల్‌గాంధీ ఫాలోవర్స్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు శనిగారపు కమలాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీగా, కేంద్రమంత్రిగా రాములు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, రాజేందర్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, నాయకులు ఉన్నారు.

నర్సరీలు పర్యవేక్షించాలి

ఖానాపూర్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పంచాయతీ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని మస్కాపూర్‌లో నర్సరీని పరిశీలించి ఓహెచ్ఆర్ పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించారు. పంచాయతీ కార్యదర్శి కల్పన, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి

- నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా
- చిట్యాలలో కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్‌రూరల్: వాహనదారులు వాహనపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామంలో ఏఎస్పీ, రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ సైబర్ నేరాలు, డయల్ 100, సీసీ కెమెరాల ఆవశ్యకత, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ మోసాలకు గురైతే భయపడకుండా వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో సరైన పత్రాలు లేని 58 బైక్‌లు, నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. జరిమానా విధించి వాహనాలను అప్పగించారు. ఇందులో సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

పోచమ్మ ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో ధర్మారపు పోచమ్మ ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పండితులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో కర్మణ పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, మండప సహిత మూల మంత్ర హోమాలు, బింబ శుద్ధి, ఆదివాస హోమాలు, కళ హోమాలు, ప్రతిష్ఠాంగ హోమాలు, కళాన్యాసం, జీవన్యాసంతోపాటు ధర్మారం పోచమ్మ స్థిరయంత్ర మూర్తి ప్రాణప్రతిష్ఠ, జయాది హోమాలు, ప్రాయశ్చిత హోమాలు, మహాపూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పదవి లేకున్నా ప్రజల్లోనే ఉండాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: నాయకులు పదవి ఉన్నా.. లేకున్నా నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఇటీవల పదవీకాలం ముగిసిన భైంసా మున్సిపల్ కౌన్సిలర్లను పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, మాజీ కౌన్సిలర్ గౌతంపింగ్లే, గాలి రాజన్న, లింగోజీ, లింగురాం ఉన్నారు.


మాజీ కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావు

ఎమ్మెల్యేకు సన్మానం
ముథోల్: మండలంలోని పలు గ్రామాలకు సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించినందుకు ముథోల్‌లో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను శుక్రవారం సన్మానించారు. మాజీ ఎంపీటీసీ భూమేశ్, బీజేపీ నాయకులు రమేశ్, జీవన్, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి
కుంటాల: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో వసతులు, కుంటాల ఉన్నత పాఠశాలలో కిచెన్‌షెడ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శనివారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను తన నివాసంలో కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల గజేందర్, దిలీప్ ఉన్నారు.

మహిళలకు ఆదర్శం రమాబాయి అంబేడ్కర్
ముథోల్: మహిళలకు రమాబాయి అంబేడ్కర్ ఆదర్శ ప్రాయురాలని ఎమ్మెల్యే రామరావుపాటిల్ అన్నారు. ముథోల్‌లోని నాగ్సేన్‌నగర్‌లో శిల్ శాంతి బుద్ధవిహార్ ఆవరణలో శుక్రవారం భీమ్ సేన యూత్ ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బౌద్ధమహాసభ పదాధికారులు, గ్రామపెద్దలు, బౌద్ధ ఉపాసకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 14వరకు అక్కకొండ బ్రహ్మోత్సవాలు


స్వామి వారు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగపూర్ గ్రామాల సమీపంలోని పురాతన శ్రీ అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 9న, స్వామివారి కల్యాణం, 12న రథోత్సవం, జాతర, 14 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతా యని ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మణ్ పేర్కొన్నారు. సమీప గ్రామాల ప్రజలు బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని కోరారు.

అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

నిర్మల్‌రూరల్: ఒకటి నుంచి 19ఏళ్లలోపు వారంతా నులిపురుగుల నివారణ (అల్బెండజోల్) మాత్రలు వేసుకోవాలని మండలంలోని ముజ్గి వైద్యాధికారి డాక్టర్ షగుఫ్త అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ నులిపురుగులతో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి లేకపోవడం, వికారం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. ఫోన్‌ను అధికంగా వినియోగిస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్

కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సునీత, హెచ్ఎం వెంకటేశ్, ఉపాధ్యాయులు గజపల్లి నర్సయ్య, వహీద్, సంతోష్, అనూష పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్ జయప్రదం చేయండి'

భైంసాటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10న చేపట్టే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు డి.పోశెట్టి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి
కడెం: హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఈనెల 10న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ దుర్గం నూతన్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. రైతులు, కార్మికులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకురి తిరుపతి, తదితరులున్నారు.

బసవేశ్వరుడి బాటలో నడవాలి

భైంసారూరల్: ప్రతి ఒక్కరూ బసవేశ్వరుడు చూపిన బాటలో నడవాలని పలువురు సూచించారు. శుక్రవారం మండలంలోని సుంక్లి గ్రామంలో వీరశైవ లింగాయత్‌ల ఆధ్వర్యంలో బసవేశ్వరుడి విగ్రహం ఆవిష్కరించారు. ఈసందర్భంగా బసవేశ్వర స్వామి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో అశోక్‌పటేల్, గంగాధర్ పటేల్, పాపన్న పటేల్, గజానంద్ పటేల్, చందుపటేల్, బసవేశ్వర పటేల్, శంకర్, వీరప్ప పటేల్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.


బసవేశ్వరుడి విగ్రహం వద్ద నాయకులు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

భైంసాటౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని భైంసా ఆర్టీసీ డిపో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ కొనుగోలు చేసి కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గంగయ్య, కుమార్, రమణ, విశ్వనాథ్, లింగయ్య, సురేశ్, సుధాకర్, నివేదిత, శ్వేతారాణి, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

ప్రశాంతంగా చదువుకోవాలి

లోకేశ్వరం: విద్యార్థులు పరీక్షల వేళ ఫోన్‌కు దూరం ఉండి ప్రశాంతంగా చదువుకోవాలని మోహన్‌రావు పటేల్ ప్రజాట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజూర, లోకేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజేశ్వర్, సుధార్‌సింగ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనసూయ, బీజేపీ కార్యకర్తలు గజ్వేరి భూమన్న, సరస్వతి, భోజవ్వ ఉన్నారు.

విహారయాత్రలతో జ్ఞానం

సారంగపూర్: మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థులు శుక్రవారం పూర్వ వరంగల్ జిల్లాలోని వెయిస్తంభాల గుడి, రామప్ప దేవాలయం దర్శించుకున్నారు. ఈసందర్భంగా అక్కడి అర్చకులు కాకతీయుల కళావైభవం, ఆలయ ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల భవనానికి భూమిపూజ

బాసర: మండలకేంద్రంలో శ్రీసరస్వతి శిశుమందిర్ ప్రాథమిక పాఠశాల(ఇంగ్లిష్ మీడియం) కోసం నిర్మించే భవనానికి శుక్రవారం తెల్లవారుజామున భూమిపూజ చేశారు. అర్చకుడు ప్రదీప్ మహరాజ్, మాజీ సర్పంచ్ శైలజ సతీశ్వర్‌రావు, శిశుమందిర్ పాఠశాల అధ్యక్షుడు కొండూరి ప్రతాప్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఉదయం సార్వజనిక గణేశ్ మండలి ప్రాంగణంలో హితైషులతో సనాతన ధర్మం, శిశుమందిర్ పాఠశాలల విద్య పరిరక్షణపై సమావేశం నిర్వహించారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు పరమానంద బన్సల్, తెలంగాణ ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు
విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నిర్మల్‌రోడ్, ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, ఏక్ మినార్ ఏరియా, మదీనా కాలనీ, పల్సి ఫీడర్, స్పిన్నింగ్ మిల్ ఫీడర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.
నర్సాపూర్(జి): సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలకేంద్రంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శంకర్ పేర్కొన్నారు.
లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మహేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
ఖానాపూర్: నెలవారీ మరమ్మతుల్లో భాగంగా ఖానాపూర్, సుర్జాపూర్, కడెం, బెల్లాల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

మచ్కల్ వాసుల పాదయాత్ర

ముథోల్: మండలంలోని మచ్కల్ గ్రామానికి చెందిన సుమారు 170 మంది భక్తులు శుక్రవారం పాదయాత్రగా మహారాష్ట్రలోని యవ్వత్‌మాల్ జిల్లా మాహూర్ దత్తాత్రి అనసూయమాత ఆలయానికి బయలుదేరారు. భజనలు చేస్తూ 170 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటామని గ్రామస్తులు తెలిపారు. నాగేష్, పోతాజీ, నాగోరావు, లాలూ ఉన్నారు.

డాక్టర్‌కు సన్మానం

ఖానాపూర్: నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్, ఖానాపూర్ వాసి డాక్టర్ వేణు గోపాల కృష్ణను శుక్రవారం ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదారావు, ఎస్సై రాహుల్ గైక్వాడ్ శాలువాతో సన్మానించారు. ఉత్తమంగా విధులు నిర్వహించినందుకు కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఏఎస్సై మణిరాం, సిబ్బంది శేఖర్, చందర్, రాంమోహన్, తదితరులు ఉన్నారు.

రమాబాయి అంబేడ్కర్ జయంతి


ఉమ్రి(కే)లో నివాళులర్పిస్తున్న సభ్యులు

తానూరు: మండలంలోని ఉమ్రి(కే), తదితర గ్రామాల్లో భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి 127వ జయంతి నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బౌద్ధమహాసభ నాయకులు సాయినాథ్, గంగాధర్, మాధవ్‌రావ్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

టీషర్టుల ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించే ఖానాపూర్, కడెం, పెంబి, ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ టీషర్టులను శుక్రవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఆవిష్కరించారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు కడెం మండలం దిల్‌దార్‌నగర్ అక్కకొండ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ వార్షికోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొక్కుల లక్ష్మణ్, కమిటీ సభ్యులు జాన్సన్‌నాయక్‌కు ఆహ్వానం అందజేశారు.

పీఎస్‌బీ ఎరువులపై అవగాహన

సోన్: రైతులు మొక్కలకు భాస్వరం అందేలా జీవన ఎరువు అయిన ఫాస్పేట్ సాల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) ఎరువులను వినియోగించాలని ఏఈవో ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం సోన్ రైతువేదికలో పీఎస్‌బీ ఎరువుల వినియోగం, లాభాలపై అవగాహన కల్పించారు. కావాల్సిన రైతులు వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

తానూరు: బెంబర క్లస్టర్ పరిధిలోని ఎల్వి, బెంబర, ఉమ్రి(కే) గ్రామాల రైతులు యాసంగిలో సాగు చేసిన పంటల వివరాలను స్థానిక రైతువేదిక కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఏఈవో శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం తీసుకొచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ

ఖానాపూర్: బాధిత కుటుంబాలను శుక్రవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. సింగాపూర్‌లో ఆ పార్టీ నాయకురాలు విమల రోడ్డు ప్ర0మాదంలో గాయపడగా ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాజూరాలో గాజర్ల లచ్చన్న తండ్రి పెద్దభూమన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.